చెత్త కొండను చిత్తు చేసే ప్రాసెసింగ్

- అమలాపురంలో రూ.1.60 కోట్లతో వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్
- చెత్త శుద్ధీకరణతో వినియోగంలోకి రానున్న బయో మైనింగ్

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీకి కొరక రాని కొయ్యగా మారిన చెత్త కొండ సమస్యను పరిష్కరించే దిశగా రూ.1.60 కోట్లతో లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ (సంప్రదాయ చెత్త శుద్ధీకరణ) యూనిట్ నిర్మించనున్నారు. దీనివల్ల నిత్యం జరిగే బయో మైనింగ్‌తో చెత్త కొండను కరిగించుకునే అవకాశమే కాకుండా భవిష్యత్‌లో వచ్చే చెత్త నిల్వలు కొండగా మారే పరిస్థితి దూరంగా కానుంది. మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను తరలించేందుకు బైపాస్ రోడ్డులో శ్మశానాన్ని ఆనుకుని పంట కాల్వ చెంత ఉన్న డంపింగ్ యార్డ్ ప్రస్తుతం పెరిగిన చెత్త కొండలతో పెను సమస్యగా మారింది. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి మంత్రి పినిపే విశ్వరూప్ చొరవతో డంపింగ్ యార్డ్ స్థలంలోనే రూ.1.60 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, డీఈఈ కొత్త అప్పలరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు ఈ డంపింగ్ యార్డ్‌లో యూనిట్‌కు అవసరమైన స్థల సేకరణ పూర్తి చేశారు. ఈ యూనిట్‌కు అవసరమైన త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఇప్పటికే మున్సిపాలిటీ విద్యుత్ శాఖకు చార్జీలు చెల్లించింది. తరుణీ అసోసియేట్స్ అనే సంస్థ ఈ యూనిట్‌కు సంబంధించిన బయో మైనింగ్‌ను నిర్మాణాన్ని చేపట్టనుంది.


కంపోస్ట్ యార్డ్‌లో పెరిగిపోయిన చెత్త కొండ

చెత్త శుద్ధీకరణ ఇలా

దాదాపు ఐదెకరాల విస్తీర్ణంలో ప్రస్తుతమున్న డంపింగ్ యార్డ్‌లో చెత్త కుప్పల స్థాయి నుంచి కొండల స్థాయికి ఎదిగిపోయింది. ఈ చెత్త కొండల్లో ఇక చెత్త వేస్తే సరిపోని పరిస్థితుల్లో బైపాస్ రోడ్డు చెంత కూడా మినీ డంపింగ్ యార్డ్‌గా మారుతోంది. తరుచూ జేసీబీలతో చెత్త కొండలను కొంత తగ్గించి చెత్తను సర్దుబాటు చేయడం షరా మామూలే. ఇలాంటి ప్రతికూల పరిస్థితులకు చరమ గీతం పాడేందుకే ఈ ప్రాసెసింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. చెత్త పెరగకుండా ఏ రోజుకారోజు యూనిట్‌లో తొలుత చెత్తలోని ప్లాస్టిక్ వస్తువులను గ్రేడింగ్ చేసి తొలగిస్తారు. మిగిలిన చెత్తను శాస్త్రీయ పద్ధతిలో కంపోస్టు(ఎరువు)గా తయారుచేస్తారు. సేకరించిన వేస్ట్ ప్లాస్టిక్ వస్తువులను రీ సైకిలింగ్‌కు తరలిస్తారు. అలాగే చెత్తను ఎరువుగా మార్చి చెత్త పరిమాణం పెరగకుండా ప్రాసెసింగ్ చేసి తిరిగి ఆదాయ వనరుగా మారుస్తారు.

త్వరలోనే అందుబాటులోకి యూనిట్

యూనిట్‌ను స్థాపించే తరుణీ అసోసియేట్స్ సూచించిన అన్ని సౌకర్యాలు కల్పించాం. త్వరితగతిన యూనిట్‌ను పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం. ప్రాసెసింగ్ యూనిట్ వస్తే చెత్త కొండలు పెరిగిపోయి కంపోస్ట్ యార్డ్‌కు స్థల కొరత అనే సమస్య ఉత్పన్నం కాదు.

– కొత్త అప్పలరాజు, డీఈఈ, మున్సిపాలిటీ, అమలాపురం

క్లుప్తంగా

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా


తుమ్మలపల్లిలో ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు

అల్లవరం: తుమ్మలపల్లి పంచాయతీ పరిధిలో ఇటీవల జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 1, 2, 3 వార్డుల్లో తాము పడుతున్న తాగునీటి ఇబ్బందులను మంత్రి విశ్వరూప్ కుమారుడు పినిపే శ్రీకాంత్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన చొరవ తీసుకుని 1, 2, 3 వార్డు ప్రజలకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ట్యాంకర్ ద్వారా ఆదివారం తాగునీటిని సరఫరా చేశారు. తమ ఇబ్బందులను తీర్చిన శ్రీకాంత్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు

అమలాపురం రూరల్: యూటీఎఫ్ రాజమహేంద్రవరం, జీఎస్ఎల్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17 తేదీన అమలాపురం సర్ సీవీ రామన్ హైస్కూల్‌లో నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంకె వెంకటేశ్వరరావు, ఎస్.జ్యోతిబస్ తెలిపారు. ఆదివారం సర్ సీవీ రామన్ స్కూల్‌లో శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ రమణం వేణుగోపాలరావు మాట్లాడుతూ శిబిరంలో 50 మంది వైద్యులతో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

రామదాసు ఫౌండేషన్ వితరణ

అమలాపురం టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక సమతానగర్‌కు చెందిన చింతపల్లి బంగారయ్యకు వైద్యఖర్చుల నిమిత్తం అబ్బిరెడ్డి రామదాసు ఫౌండేషన్ ట్రస్ట్ రూ.6 వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేసింది. అదే ప్రాంతానికి చెందిన ఇసుకపట్ల శ్రీనుకుమార్ మరో రూ.3 వేలు సమకూర్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అబ్బిరెడ్డి సురేష్, బొమ్మన బాలస్వామి, ఆకుల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సాయం


బాధితుడికి చెక్కు అందజేస్తున్న రమణారావు

ఉప్పలగుప్తం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న స్థానిక చల్లపల్లి అంబేద్కర్ నగర్‌కు చెందిన కొల్లు రెడ్డి రత్నంకు వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంచే రమణారావు రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. కుంచే రమణారావు ఆదివారం బాధితుడిని పరామర్శించి సాయం చెక్కును అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన రమణారావుకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.శ్రీను, కె.మధు, పి.నాగేశ్వరరావు, ఆర్.బాబి, వై.రవితేజ, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరునికి అష్ట ద్రవ్యాభిషేకాలు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పవిత్ర సంకట చతుర్థి సందర్భంగా విఘ్నేశ్వరునికి ఆలయ పురోహితుడు సద్గురు సత్యనారాయణ అష్ట ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అఖండ దీపారాధన, ప్రసాద వితరణ చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

ముమ్మిడివరం: మండల పరిధిలోని అయినాపురంలో నూతనంగా నిర్మించిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, యంత్రస్థాపన, శిఖర స్థాపన వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

స్కిల్ హబ్ ద్వారా ఉచిత శిక్షణ

ముమ్మిడివరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు స్కిల్ హబ్ ద్వారా ఉచిత శిక్షణనిచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోక్‌మాన్ ఆదివారం తెలిపారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు గాను మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు పరిశీలిస్తున్నామన్నారు. కొత్తపేట నియోజకవర్గానికి అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, మెడికల్ ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్ పోస్టులకు, రాజోలు నియోజకవర్గానికి సంబంధించి అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ పోస్టులకు, మండపేట నియోజకవర్గానికి జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పోస్టులకు శిక్షణనిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సీఎం రంగసామికి వివరించిన మల్లాడి

యానాం: తాళ్లరేవు మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనతో పాటు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురి కుటుంబ వివరాలను ఫోన్‌లో సీఎం రంగసామి దృష్టికి తీసుకెళ్లినట్లు ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశానని, ఆర్థిక సాయంగా ఒక్కొక్కరికి రూ.లక్ష ప్రకటించారన్నారు.

అమ్మను మించిన దైవం లేదు


తల్లులకు రవికల వస్త్రాలు అందజేస్తున్న సెంట్రల్ బ్యాంక్ సీఈవో శ్రీదేవి, చిత్రంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

- ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక సూర్య వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడా స్థలంలో ఆదివారం ఉదయం జరిగిన మదర్స్ డే కార్యక్రమంలో ఎమ్మెల్సీ సూర్యనారాణరావు మాట్లాడారు. శిక్షణ శిబిరంలో తర్ఫీదు పొందుతున్న 150 మంది బాలబాలికల తల్లుల సమక్షంలో మదర్స్ డే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి పశ్చిమ గోదావరి జిల్లా సెంట్రల్ బ్యాంక్ సీఈవో బొంతు శ్రీదేవి అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె చేతుల మీదుగా తల్లులకు రవికల వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో బాస్కెట్ బాల్ కోచ్‌లు ఆకుల ఉమ, కుడుపూడి బుజ్జి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృదినోత్సవం

ఐ.పోలవరం: వైజ్ఞానిక సాహితీ సంస్థ ప్రజ్ఞ సాహితీ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు ఐ.పోలవరంలో ఆదివారం ఘనంగా జరిగాయి. స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిరూపం మాతృమూర్తేనని పలువురు వక్తలన్నారు. ప్రజ్ఞ సాహితీ అధ్యక్షుడు పుల్లెపు వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంవీ సూర్యం, నారాయణరావు, నందుల ఈశ్వరరావు, కొర్లపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా


వాడపర్రులో మంత్రి విశ్వరూప్‌కు వేదాశీర్వచనం అందిస్తున్న పురోహితుడు


మునిపల్లిలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం: దేవాలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని వాడపర్రులో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు పండితులు ఘన స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అందించారు. ఆయన వెంట గోదావరి సెంట్రల్ బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు చప్పిడి దుర్గారావు పాల్గొన్నారు.

మునిపల్లిలో.....

మునిపల్లిలో వేంచేసి ఉన్న పార్వతీ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో పండితులు కొమానపల్లి సూర్యనారాయణశర్మ, కాశీ విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం టౌన్: గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్‌ఎన్ఎస్ వరప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించి పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. శిక్షణ శిబిరాలు వచ్చే నెల 11వ తేదీ వరకూ కొనసాగుతాయని చెప్పారు. శిక్షణ ఏర్పాట్లుచేసిన గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి సత్యనారాయణ మూర్తిని అభినందించారు.


శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వరప్రసాద్

నేడు యథావిధిగా 'స్పందన'

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి, మండల కార్యాలయాల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. అధికారులు ఉదయం 10 గంటల నుంచే ఫిర్యాదులు స్వీకరిస్తారని, గ్రామ వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనల స్వీకరణ ఉంటుందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

ఐ.పోలవరం: మండలంలోని తిళ్లకుప్ప గ్రామంలో సత్తెమ్మతల్లి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మాజీమంత్రి కురసాల కన్నబాబు, స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ సత్తెమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయంలో భారీ అన్నసమారాధన జరిగింది.


సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న మాజీ మంత్రి కన్నబాబు, ఎమ్మెల్యే పొన్నాడ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- మిల్లర్లతో జేసీ ధ్యానచంద్ర


ఉప్పలగుప్తంలో రైస్‌మిల్లు నిర్వాహకులతో మాట్లాడుతున్న జేసీ ధ్యానచంద్ర

ఉప్పలగుప్తం: ధాన్యం సేకరణలో నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత రైస్ మిల్లర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జేసీ ధ్యానచంద్ర హెచ్చరించారు. ఉప్పలగుప్తంలోని శివాని, శేషారత్న రైస్ మిల్లులను జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.పాపారావుతో కలసి ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా ఏ రోజుకారోజు వస్తున్న ధాన్యాన్ని రైస్ మిల్లుల వద్ద ఎకనాలజిమెంట్ ఇస్తామన్నారు. ధాన్యం పాడైందని, తేమ శాతం ఎక్కువగా ఉందనే కారణాలతో మిల్లర్లు అక్రమాలకు పాల్పడినట్టు రైతులు ఫిర్యాదు చేస్తే, అలాంటి మిల్లులపై చర్యలు తీసుకుంటామన్నారు. మిల్లుల నిర్వాహకుల తీరును బట్టి అవసరమైతే రైస్ మిల్లులను బ్లాక్ లిస్టులో పెడతామని అన్నారు. ధాన్యం సేకరణ సజావుగా జరిగేందుకు ప్రతి మిల్లు వద్ద కస్టోడియన్ అధికారులుగా వీఆర్వోలను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు మమత, వీరవేణి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి భక్తుల విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. నిడదవోలుకు చెందిన కె.నాగవెంకట మెహర్‌బాబు–జ్ఞాన నాగ సింధూర దేవి దంపతులు రూ.11,116, కైకలూరుకు చెందిన ఎస్.నాగు–శాంతి దంపతులు రూ.10,116, రాజమహేంద్రవరానికి చెందిన ఎ.జాహ్నవీల రూ.10,116, ఆత్రేయపురానికి చెందిన ఎం.సీతారామరాజు రూ.10,116, తాడేపల్లిగూడేనికి చెందిన పి.శశిరేఖ రూ.10,116, విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1979–84 బ్యాచ్‌లలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సుమారు 40 ఏళ్ల అనంతరం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనానికి కుటుంబ సభ్యులతో తరలి వచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సదరు బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఇందులో భాగస్వామ్యమయ్యారు. జ్యోతిప్రజ్వలనను గుత్తి సుబ్బలక్ష్మి, సరెళ్ల పద్మ, కామిశెట్టి మాచరమ్మ చేశారు. డాక్టర్ ఆకుల వెంకట రామ్మోహన్‌రావు అధ్యక్షత వహించారు. నాడు ఈ సరస్వతి నిలయంలో చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్లిన పూర్వ విద్యార్థులంతా అదే పాఠశాలలో సుదీర్ఘకాలం తరువాత కలుసుకుని ఆనందపరవశులయ్యారు. అలనాటి మధురస్మృతులను నెమరు వేసుకున్నారు. వారంతా ఒకరికొకరు పరిచయాలు చేసుకున్నారు. ఆహ్లాదంగా, ఆనందంగా ఆద్యంతం గడిపారు. తరగతి గదుల్లో పాఠాలు నేర్పిన గురువులకు శాలువాలు కప్పి పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఆహ్వాన కమిటీ సభ్యులు శ్రీపాద వెంకటేశ్వర్లు, రాపాక పెద్దిరాజు, ఉప్పుగంటి నాగ మల్లేశ్వరరావు, పసలపూడి శ్రీనివాసరావు, గానాల మోహన వెంకట కృష్ణారావు, బళ్ల మహాత్మా గాంధీ, కాశిన సూరన్న, అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి


చొల్లంగి అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


ఐ.పోలవరంలో హనుమాన్ విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అమలాపురంలో తమలపాకులపై సిందూరంతో శ్రీరామ అని రాసి స్వామిని పూజిస్తున్న దృశ్యం

తాళ్లరేవు: హనుమాన్ జయంతి పర్వదినాన్ని ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన చొల్లంగి అభయాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల నుంచే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ సత్యన్నారాయణ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల, ఐ.పోలవరం, తిళ్లకుప్ప, ఎదుర్లంక, పాతయింజరం, కొమరగిరి, జి.వేమవరం, జి.మూలపొలం, పశువుల్లంక తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆంజనేయస్వామి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై తమ గోత్రనామాలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల వద్ద భజన కాలక్షేపాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అమలాపురం టౌన్: స్థానిక రవణంవీధిలోని సర్వమంగళ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. భక్తులు తమలపాకులపై సిందూరంతో శ్రీరామ అని అక్షరాలు రాసి ఆ ఆకులతో ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ అనువంశీయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాచిరాజు రవి కుమార్, నాగవల్లి దంపతులచే ప్రసన్నాంజనేయ స్వామి వారికి సహస్ర నాగవలిల దళ పూజలు వైభవంగా జరిపారు.

రామభక్తులతో ర్యాలీ

యానాం: యానాంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం విశ్వహిందూ పరిషత్, యానాం ఆర్ఎస్ఎస్‌శాఖ ఆధ్వర్యంలో రామ భక్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి మందిరం నుంచి యానాం గోపాల్‌నగర్ బైపాస్ వద్ద గల ఆంజేయస్వామి విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. అనంతరం హనుమాన్ చాలీసా పఠనం చేసి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం పోలమ్మ చెరువు గట్టు వద్ద, పల్లవారిపాలెం గాడిలంక, క్రాప చింతలపూడి, విష్ణాలయం సెంటర్‌లలో అభయాంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత మండపారాధన, సింధూర అర్చన నిర్వహించారు.

'పది' విజేతలకు నగదు బహుమతులు


బహుమతులందుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులతో వాకర్స్ యోగ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు


విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి, ఎంపీపీ భాగ్యలక్ష్మి

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పట్టణ మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు కర్రి పవన్ సాయి రామ్, ఆకుల శ్రీ వెంకట సత్య శ్రవణ్, సత్తి వింధ్య, ముమ్మిడి గాయత్రిలకు మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు చేతుల మీదుగా సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సంస్థ నగదు బహుమతులు అందజేసింది. స్థానిక కూచిమంచి అగ్రహారంలో ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సదస్సులో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి నల్లా నరసింహమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, తేతలి సత్యనారాయణరెడ్డి, కవి బీవీవీ సత్యనారాయణ, చిట్టుమేను సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు సత్కారం

అమలాపురం రూరల్: మాతృ దినోత్సవం సందర్భంగా అమలాపురం తేజస్విని ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు దంగేటి చైతన్య, సత్య పద్మిని, సుందరపల్లి యశస్విని, సత్తి వింధ్య, కె.పవన్ రామ్ సాయి, మల్లవరపు చైతన్య జ్యోతి, ఉద్దేశపు చరణ్‌లను ప్రోత్సహిస్తూ పెన్నులు, పుస్తకాలు, డిక్షనరీలు, మెమోంటోలు అందజేశారు. మాతృదినోత్సవం పురస్కరించుకొని విద్యార్థుల తల్లిదండ్రులను దుశ్శాలువాలు, పూలదండలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, సంస్థ అధినేత ఉద్దేశపు వెంకటేశ్వరరావు, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు, కవి బీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.